క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

హసన్‌పర్తి: చింతగట్టు సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4.30గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ప్రదీప్‌కుమార్ తెలిపారు. నిరూప్‌నగర్‌తండా మెయిన్ రోడ్డు, రైల్వే గేట్, ప్రధాన రహదారుల్లో విద్యుత్ స్తంభాల ఏర్పాటు కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని పేర్కొన్నారు.

నేడు 'ఎస్‌వీఎస్'లో జాబ్‌మేళా

హసన్‌పర్తి: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పారిశ్రామిక ప్రగతిని పురస్కరించుకుని భీమారంలోని ఎస్‌వీఎస్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో మంగళవారం మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఎస్‌వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు తెలిపారు. జెన్‌పాక్ట్, జియో, ఈఎంఆర్‌ఐ, ముత్తూట్ ఫైనాన్స్, హెచ్‌ఆర్‌హెచ్ కంపెనీలను ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. బీటెక్, బీఫార్మసీ, ఎంబీఏ, బీఎస్సీ, బీకాం, బీఏ అర్హత కలిగి ఉండాలని చెప్పారు. మరిన్ని వివరాలకు 99859 10311, 72071 24124 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వినియోగదారుల మండలి జిల్లా కార్యదర్శిగా స్వాతి



హన్మకొండ చౌరస్తా: తెలంగాణ వినియోగదారుల మండలి హనుమకొండ జిల్లా మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా బచ్చు స్వాతి నియమితులయ్యారు. ఈమేరకు హనుమకొండలో సోమవారం జరిగిన మండలి జిల్లా కమిటీ సమావేశంలో స్వాతికి మండలి రాష్ట్ర అధ్యక్షురాలు కూతురు శ్రావ్య నియామక ఉత్తర్వులు అందజేశారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

హన్మకొండ: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని హనుమకొండలోని సాఫ్‌టెక్ కంప్యూటర్స్‌లో నిరుపేద విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మధుమిత దండే తెలిపారు. 200మంది పేద విద్యార్థులకు కంప్యూటర్స్ కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ఆమె ఒక ప్రకటనలో వివరించారు. అడ్మిషన్ల కోసం హనుమకొండ కిషన్‌పురలోని జీఎంఆర్ కాంప్లెక్స్ మూడవ అంతస్తులోని సాఫ్‌టెక్ కంప్యూటర్స్ ఇనిస్టిట్యూట్‌లో సంప్రదించాలని కోరారు. మరిన్ని వివరాలకు 92468 99300, 92468 99302 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షుడికి సన్మానం

కాజీపేట: రెడ్‌క్రాస్ సొసైటీ నూతన పాలకవర్గంలో ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన పెద్ది వెంకటనారాయణ గౌడ్‌ను కాజీపేట పట్టణంలోని 61వ డివిజన్ ఫాతిమానగర్ కాలనీలో కొండిన్య పరపతి పరస్పర సహకార సంఘం సభ్యులు సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో అంబాల సూర్యనారాయణ గౌడ్, గట్టు సత్యనారాయణ గౌడ్, కొండ నరేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ట్రస్మా వరంగల్ జిల్లా కార్యవర్గం

వరంగల్: తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) వరంగల్ జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చల్లా నాగార్జునరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బాశెట్టి వెంకటేశ్వర్లు, కార్యనిర్వాహక కార్యదర్శిగా నాసం సూర్యనారాయణ, కోశాధికారిగా దండపంతుల రాంమూర్తి ఎన్నికయ్యారని ఎన్నికల కమిటీ కన్వీనర్ కంది గోపాల్‌రెడ్డి తెలిపారు. ఎల్‌బీనగర్‌లోని లర్నర్స్ ల్యాండ్ హైస్కూల్‌లో ట్రస్మా పూర్తిస్థాయి జిల్లా కమిటీని సోమవారం ప్రకటించారు. కార్యవర్గం సభ్యులతో ట్రస్మా రాష్ట్ర నాయకులు మోతె సమ్మిరెడ్డి, భూపాల్‌రావు, రమేష్‌రావు, కాసం చంద్రారెడ్డి ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేయించారు.

నియామకమైన కమిటీనే గుర్తిస్తున్నాం..

ఖిలా వరంగల్: ట్రస్మా రాష్ట్ర కమిటీకి వ్యతిరేకంగా జిల్లా కమిటీలు వ్యవహరించకూడదని, అందరి సమష్టి నిర్ణయం మేరకు నియామకమైన వరంగల్ జిల్లా వడుప్సా (ట్రస్మా) కమిటీనే గుర్తిస్తున్నట్లు ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెజార్టీ వడుప్సా సభ్యుల అభీష్టం మేరకు నూతన అధ్యక్షుడిగా నాగార్జున రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బిల్లా రవి, కోశాధికారిగా ఠాకూర్ జ్ఞానేశ్వర్‌సింగ్, కార్యనిర్వాహక కార్యదర్శిగా సూర్యనారాయణ, చీఫ్ అడ్వైజర్‌గా ఎస్. వెంకటేశ్వర్‌రావు, అడ్వైజర్‌గా కె.చంద్రారెడ్డి నియామితులయ్యారని పేర్కొన్నారు.

సివిల్స్ ర్యాంకర్‌కు సన్మానం

విద్యారణ్యపురి: సివిల్స్ సర్వీసెస్ ఫలితాల్లో 646వ ర్యాంకు సాధించిన మంద అపూర్వను తెలంగాణ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో పలువురు సన్మానించారు. నగరంలోని సుబేదారిలోని ఆఫీసర్స్ క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమానికి అపూర్వను శాతవాహన యూనివర్సిటీ మాజీ ఉపకులపతి మహ్మద్ ఇక్బాల్ అలీ, కేయూ ప్రొఫెసర్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ అభినందించారు.

హన్మకొండ అర్బన్: సివిల్స్ ఫలితాల్లో ఆల్ ఇండియా 646వ ర్యాంక్ సాధించిన జిల్లాకు చెందిన మంద అపూర్వను సామాజికవేత్త ఈ.వి శ్రీనివాస్‌రావు సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు సేవచేసి మంచి పేరు తెచ్చుకోవాలని ఆమెకు సూచించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నగరవ్యాప్తంగా ప్రజలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విరివిగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతీఒక్కరు కృషి చేయాలని కోరారు. మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమని వివరించారు. ప్లాస్టిక్ వాడకాన్ని త్యజించాలని సూచించారు. - సాక్షి నెట్‌వర్క్



ఏవీవీ కళాశాలలో పర్యావరణంపై అవగాహన కల్పిస్తున్న ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు



కేవీకేలో మాట్లాడుతున్న డాక్టర్ సౌమ్య



హన్మకొండ చౌరస్తా: జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న పీసీబీ ఈఈ సునీత



హరిత కాకతీయ హోటల్‌లో మొక్కలు నాటుతున్న యోగా గురువు శ్రీనివాస్, తదితరులు



కాజీపేటలో మొక్కలు నాటుతున్న రైల్వే కార్మికులు



విద్యారణ్యపురి: ప్లకార్డులు ప్రదర్శిస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు



హసన్‌పర్తి: సుజాత పాఠశాలలో మొక్కలు నాటుతున్న స్కూల్ యాజమాన్యం

శారీరక ఆరోగ్యానికి క్రీడలు దోహదం

హన్మకొండ: శారీరక ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి క్రీడలు, వ్యాయామం ఎంతగానో దోహదపడుతాయని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. హనుమకొండ సుబేదారిలోని వరంగల్ (ఆఫీసర్స్) క్లబ్‌లో టెన్నిస్ కోర్టు, షటిల్ కోర్టు, కాన్ఫరెన్స్ హాల్‌ను వరంగల్ పోలీసు కమిషనర్ ఏవీ.రంగనాథ్, కలెక్టర్ సిక్తా పట్నాయక్‌తో కలిసి చీఫ్‌విప్ సోమవారం రాత్రి ప్రారంభించారు. అనంతరం సరదాగా కొద్దిసేపు షటిల్ ఆడారు. కార్యక్రమంలో వరంగల్ క్లబ్ కార్యదర్శి దొంతి రవీందర్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ చెరుకు వెంకట రాజిరెడ్డి, కోశాధికారి బజ్జూరి వైకుంఠం, డీఎస్పీ ఎం.జితేందర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు డాక్టర్ జె.సుధాకర్ రెడ్డి, విశ్వప్రకాష్, నాగకిషన్, సతీష్, సంపత్, రమణారెడ్డి రెడ్డి పాల్గొన్నారు.



షటిల్ ఆడుతున్న చీఫ్ విప్, కలెక్టర్

రైలు ప్రమాద మృతులకు నివాళి



మృతులకు నివాళులర్పిస్తున్న సంఘం సభ్యులు

కాజీపేట: ఒడిశా రాష్ట్రంలో జరిగిన ఘోర రైలు ప్రమాదంలో మృతిచెందిన ప్రయాణికులకు తేజోమయి మాలకుల సంక్షేమ సంఘం సభ్యులు కాజీపేట పట్టణంలో సోమవారం రాత్రి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. సంఘం పట్టణ అధ్యక్షుడు మర్యాల కృష్ణ ఆధ్వర్యంలో బాపూజీనగర్ చౌరస్తా నుంచి అమరవీరుల స్తూపం వరకు ర్యాలీగా వెళ్లారు. కార్యక్రమంలో కోండ్ర నర్సింగరావు, అయ్యాల దానం, మైసారపు సిరిల్ లారెన్స్, సాంబయ్య, బర్ల వెంకటేశ్వర్లు, భద్రయ్య పాల్గొన్నారు.

మెస్ సౌకర్యం కొనసాగించాలి



కేయూలో ఆందోళన చేస్తున్న విద్యార్థులు

కేయూ క్యాంపస్: తమకు మెస్ సౌకర్యం యథావిధిగా కొనసాగించాలని కాకతీయ యూనివర్సిటీలో హాస్టళ్ల విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈమేరకు పరిపాలన భవనం వద్ద సోమవారం ఆందోళన చేశారు. న్యాక్ పీఆర్‌టీం ఇటీవల పర్యటించిన నేపథ్యంలో పీజీ కోర్సుల 4వ సెమిస్టర్ విద్యార్థులకు ప్రత్యక్ష తరతగతులున్నాయని క్లాసులకు హాజరు కావాలని అధికారులు తెలిపారు. అయితే, జులై 5నుంచి పరీక్షల నిర్వహించనుండగా 4నుంచి కేయూలోని యూనివర్సిటీ అధ్యాపకులకు సెలవులు ప్రకటించిన యూనివర్సిటీ అధికారులు.. ఈనెల 6వ తేదీ నుంచి హాస్టళ్లు, మెస్‌లు మూసివేస్తామని విద్యార్థులకు సమాచారం అందించారు. దాంతో విద్యార్థులు ఆందోళనకు దిగారు. పోలీసులు రంగంలోకి దిగి విద్యార్థులతో ఆందోళనను సద్దుమణిగేలా చేశారు. క్యాంపస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సురేశ్ లాల్, హాస్టళ్ల డైరెక్టర్ మంజుల అక్కడికి వచ్చి క్యాంపస్‌లోని హాస్టళ్లు, మెస్‌లు యథావిధిగా కొనసాగుతాయని వారు చెప్పారు.

ప్లాస్టిక్ భూతాన్ని పారదోలాలి

కాజీపేట సెంటర్: ప్లాస్టిక్ భూతాన్ని పారదోలాలని పర్యావరణ ఇంజనీర్ ఆర్.సునీత పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వరంగల్ జిల్లా విద్యాశాఖ, వరంగల్ ప్రాంతీయ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో గ్రీన్‌ర్యాలీ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలే కాకుండా ప్రజలు కూడా కాలుష్యాన్ని నియంత్రించాలని సూచించారు.

సూర్యచంద్‌కు ప్రథమ బహుమతి

దేశాయిపేట: ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ వరంగల్ జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీలో వరంగల్ ఎల్‌బీనగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (చార్‌బౌలి)కి చెందిన విద్యార్థి గురు సూర్యచంద్ జూనియర్స్ విభాగంలో జిల్లా స్థాయి మొదటి బహుమతిని సాధించాడు. పబ్లిక్‌గార్డెన్‌లో లో జరిగిన సమావేశంలో బోర్డ్ ఈఈ సునీత, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్, డీసీఈబీ డైరెక్టర్ కృష్ణమూర్తి చేతుల మీదుగా విద్యార్థి ప్రశంసపత్రం, షీల్డ్ అందుకున్నట్లు హెచ్‌ఎం కవిత తెలిపారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

ఖిలా వరంగల్: తాగునీటి సమస్యను అధికారులు పరిష్కరించాలని బీజేపీ తూర్పు నాయకుడు కుసుమ సతీష్ డిమాండ్ చేశారు. ఖిలా వరంగల్ మధ్యకోటలో బీజేపీ 38వ డివిజన్ అధ్యక్షుడు చంద్రమోహన్ ఆధ్వర్యంలో బీజేపీ నేతలు బస్తీనిద్ర కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి చేపట్టారు. ఈసందర్భంగా సోమవారం మధ్యకోటలో పర్యటించారు. ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అశోక్, నాగేష్, మహేందర్, ప్రవీణ్, పూర్ణచందర్, సాయి, శ్రీను, రాజు, ఆకుతోట కిరణ్, గొర్రె కోటి తదితరులు పాల్గొన్నారు.



శృంగారపు బావిని పరిశీలిస్తున్న నాయకులు

తెలంగాణలోనే 24గంటల కరెంట్

కరీమాబాద్: దేశవ్యాప్తంగా ఎక్కడాలేని విధంగా తెలంగాణలోనే 24గంటల పాటు విద్యుత్ సరఫరా ఉందని వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా ఉర్సు సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించిన విద్యుత్ విజయోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో ప్రజలకు నిరంతర విద్యుత్ అందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నారని గుర్తుచేశారు. నాయీబ్రాహ్మణులకు 250యూనిట్లు, రజకులు, దళితులకు 101యూనిట్ల సబ్సిడీ విద్యుత్ అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శ్రీవత్స, డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్ మసూద్, ఆర్డీఓ మహేందర్‌జీతోపాటు విద్యుత్ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేందర్

బ్రిజ్‌భూషణ్‌ను వెంటనే అరెస్టు చేయాలి



వరంగల్ చౌరస్తా: ధర్నా చేస్తున్న రైతు సంఘాల నాయకులు

వరంగల్ చౌరస్తా: భారత రెజ్లర్ల సమాఖ్య అధ్యక్షుడు, భారతీయ జనతా పార్టీ పార్లమెంట్ సభ్యుడు బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌ను వెంటనే అరెస్టు చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కేఎం) నాయకులు డిమాండ్ చేశారు. వరంగల్ హెడ్‌పోస్టాఫీస్ సెంటర్‌లో రైతు సంఘాల నాయకులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా రెజ్లర్లపై ఢిల్లీ పోలీసులు పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు రాచర్ల బాలరాజు, వీరగోని శంకరయ్య, సోమిడి శ్రీనివాస్, కుమార్, చిర్ర సూరి, ఇనుముల కృష్ణ, హంసల్‌రెడ్డి, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గంగుల దయాకర్ పాల్గొన్నారు.

మహిళా రెజ్లర్లకు న్యాయం చేయాలి

హన్మకొండ: లైంగిక వేధింపులకు గురై ఆందోళన చేస్తున్న మహిళా రెజ్లర్లకు న్యాయం చేయాలని ప్రజావేదిక రాష్ట్ర చైర్మన్ తిరునహరి శేషు అన్నారు. ఈమేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి రాసిన లేఖను హనుమకొండలో సోమవారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా శేషు మాట్లాడుతూ లైంగిక వేధింపులకు పాల్పడిన ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్‌ను శిక్షించాలని మహిళా రెజ్లర్లు ఆందోళన చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం చేష్టలుడిగి చూడడం దుర్మార్గమని విమర్శించారు. కార్యక్రమంలో ప్రజావేదిక నాయకులు దారబోయిన సతీష్, చిన్నాల యశ్వంత్ యాదవ్, నరేందర్ పాల్గొన్నారు.

'ఉపాధిహామీ' నిర్వీర్యానికి కేంద్రం కుట్ర

హన్మకొండ అర్బన్: ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని, దానికి వ్యతిరేకంగా బీకేఎంయూ ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేస్తామని బీకేఎంయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్రాములు అన్నారు. ఉపాధిహామీ చట్టం పరిరక్షణకు కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించి, అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనుల నిధులలో కోత పెడుతూ కోట్లాది మంది వ్యవసాయ కూలీల జీవితాలతో కేంద్రం చెలగాటమాడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సంవత్సరానికి రూ.2.70 లక్షల కోట్ల నిధులు కేటాయించి 200రోజుల పనిదినాలు ఉండేలా చూడాలని సూచించారు. అలాగే, కూలీలకు రోజుకు రూ.600 చెల్లించాలన్నారు. కార్యక్రమంలో జాతీయ సమితి సభ్యులు మోతె లింగారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మద్దెల ఎల్లేష్, మునిగాల భిక్షపతి, గుమ్మడి రాజుల రాములు, డీబీఎఫ్ కార్యదర్శి చుంచు రాజేందర్, అధ్యక్షుడు మాదాసి సురేష్, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు ఎ.రామచంద్రారావు, భిక్షపతి, శంకర్‌నాయక్, రాజమణి, రజిత, సుమన్, భద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

రాష్ట్ర ఏర్పాటుతోనే అన్ని రంగాల్లో అభివృద్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేష్

హసన్‌పర్తి: ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుతోనే తెలంగాణ అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించిందని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. హసన్‌పర్తి మండలం సీతంపేటలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి బీఆర్‌ఎస్ సర్కారు పెద్దపీట వేస్తోందని వివరించారు. తొలుత భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక సర్పంచ్ జనగాం శరత్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ కేతపాక సునీత, జెడ్పీటీసీ సభ్యురాలు రేసుకుంట్ల సునీత, ఎంపీటీసీ సభ్యురాలు రజిత, ఉప సర్పంచ్ భగవాన్‌రెడ్డి, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ అంచూరి విజయ్, పీఏసీఎస్ చైర్మన్ బిల్లా ఉదయ్‌కుమార్ రెడ్డి, జక్కు రమేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వీసం సురేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రజనీకుమార్ పాల్గొన్నారు.

హసన్‌పర్తిలో మినీ స్టేడియానికి కృషి

హసన్‌పర్తిలో మినీ స్టేడియం నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే రమేష్ అన్నారు. హసన్‌పర్తిలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 45రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక బాక్సింగ్ వేసవి శిక్షణ శిబిరం సోమవారం ముగిసింది. బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పెద్దమ్మ నర్సింహరాములు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ శివకుమార్, ఎంపీపీ కేతపాక కె.సునీత, జెడ్పీటీసీ సునీత, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్, పీఏసీఎస్ చైర్మన్లు ఉదయ్‌రెడ్డి, రమేష్, కుమారస్వామి రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ విజయ్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

సీపీ రంగనాథ్‌కు రుణపడి ఉంటాం..

కాజీపేట: తప్పుడు కాగితాలతో ప్రైవేట్ భూములను ఇతరులకు విక్రయించిన ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన సీపీ డాక్టర్ ఏవీ.రంగనాథ్‌కు రుణపడి ఉంటామని కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రుద్రారపు రాజ్‌మోహన్ రావు అన్నారు. సమావేశంలో నర్సింహరావు, బి.నర్సింగరావు, జె.వెంకటరెడ్డి, టి.సోమిరెడ్డి, కుమారస్వామి, సుధాకర్, కె.రవీందర్ రెడ్డి, జలపతిరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డ్ సమస్యను పరిష్కరించండి

మడికొండ: మడికొండ శివారులోని డంపింగ్ యార్డు నుంచి వెలువడుతున్న పొగతో రాంపూర్, మడికొండ, ఇతర గ్రామాల ప్రజలు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారని 46వ డివిజన్ కార్పొరేటర్ సరోజన అన్నారు. డంపింగ్‌యార్డ్ సమస్యను పరిష్కరించాలని కమిషనర్ రిజ్వాన్ బాషాను కోరారు.

అంబేడ్కర్ ఆలోచన విధానంతో ముందుకు..

హన్మకొండ: బీఆర్.అంబేడ్కర్ ఆలోచన విధానంతో ముందుకు వెళ్తానని ఐపీఎస్ రిటైర్డ్ అధికారి కేఆర్.నాగరాజు అన్నారు. హనుమకొండలోని జెడ్పీ సమావేశం మందిరంలో నాగరాజుకు ప్రజా సంఘాల నాయకులు జ్ఞాపిక అందించి సన్మానించారు. కార్యక్రమంలో ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ఎరగ్రట్టు స్వామి, దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేష్‌కుమార్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

తూర్పు ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటా..

వరంగల్: వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ అండగా ఉంటానని బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. 13వ డివిజన్ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం జన్ను నాగరాజు ఆధ్వర్యంలో పలువురు నాయకులు బీఆర్‌ఎస్ పార్టీ నుంచి బీజేపీలో చేరగా వారిని పార్టీలోకి సోమవారం ఆహ్వానించారు.

ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి విరాళంగా కారు

హన్మకొండ: ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి విరాళంగా కారును ఆ సంఘం మాజీ నగర అధ్యక్షుడు సోదా రామకృష్ణ వాల్మీకి విరాళంగా అందించారు. ఈమేరకు ఆదివారం రాత్రి హనుమకొండలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ చేతుల మీదుగా తాళం చెవిని నరేష్‌కు అందించారు.

హజ్ యాత్రికులకు సన్మానం

కాజీపేట: కాజీపేట పట్టణం నుంచి హజ్ యాత్రకు వెళ్తున్న యాత్రికులను జామ మసీదు ఆవరణలో ఇమామ్ ఎస్‌కే.మహబూబ్ ఉర్ రహమన్ సోమవారం సన్మానించారు. జామ మసీదు కమిటీ పెద్దలు ఎండీ.హమీద్, ఎండీ.జాఫర్, ఎండీ.సోని, యూసఫ్, జాకీర్ హుస్సేన్, గౌస్ పాల్గొన్నారు.

అంజన్‌కుమార్‌ను కలిసిన కాంగ్రెస్ నేతలు



వరంగల్: వరంగల్ నగరానికి వచ్చిన మాజీ ఎంపీ, కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు అంజన్‌కుమార్ యాదవ్‌ను హనుమకొండలో సంగెం కాంగ్రెస్ మండల బీసీ సెల్ అధ్యక్షుడు గోపతి రవికుమార్‌యాదవ్ నేతృత్వంలోని పలువురు నాయకులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈమేరకు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి, వరంగల్ తూర్పు నాయకులు మహ్మద్ అయూబ్ తదితరులు పాల్గొన్నారు.

లైబ్రరీలో అజీజ్‌ఖాన్ జన్మదిన వేడుకలు

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, ఉమ్మడి వరంగల్ జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు మహ్మద్ అజీజ్‌ఖాన్.. తన జన్మదిన వేడుకలను జిల్లా గ్రంథాలయంలో సిబ్బంది, ఒలింపిక్స్ సంఘం బాధ్యుల సమక్షంలో సోమవారం జరుపుకున్నారు. గ్రంథాలయ ఆవరణలో మొక్క నాటి అనంతరం కేక్ కట్ చేశారు.

కాశిబుగ్గలో చండీహోమం

కాశిబుగ్గ: కాశిబుగ్గలోని కాశీ విశ్వేశ్వరాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ ఆవరణలోని యాగశాలలో భక్తిశ్రద్ధలతో చండీహోమాన్ని ఆలయ అర్చకులు వైభవంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో మాజీ కార్పొరేటర్ బయ్యా స్వామి, సతీష్‌కుమార్, సునీత, కుసుమ సాగర్, సునీత, సతీష్, స్వప్న, విఠల్, ప్రియాంక, ఓంకారేశ్వర్, రమేష్, సృజన తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కాజీపేట: కాజీపేట 47వ డివిజన్ బాపూజీనగర్ కాలనీకి చెందిన బీజేపీ జిల్లా నాయకుడు ఉడుతల బాబురావు కుమారుడు శివశంకర్ సోమవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కాగా, బాధిత కుటుంబ సభ్యులను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ పరామర్శించారు. పరామర్శించిన వారిలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, కార్పొరేటర్ నర్సింగ్, నార్లగిరి రమేష్, రామలింగం, భగవాన్‌దాస్ ఉపాధ్యాయ పాల్గొన్నారు.

మహంకాళి ఆలయంలో నూతన కలశస్థాపన

మడికొండ: కాజీపేట మండలం మడికొండలో మహంకాళి ఆలయంలో నూతన కలశస్థాపన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. అర్చకుడు మంత్రవాది వెంకటప్రసాద్ మంత్రోచ్చరణల మధ్య తొలుత హోమం నిర్వహించారు.

మార్కెట్‌లో వ్యాపారికి గాయాలు

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లోని పసుపు యార్డులో ఓ వాహనం తగిలి సత్యసాయి జనరల్ కమీషన్ యాజమాని భిక్షపతికి గాయాలయ్యాయి. పసుపు యార్డులోకి పసుపు బస్తాలు తెచ్చి దింపి వెళ్లే క్రమంలో సంఘటన సోమవారం జరిగినట్లు తెలిసింది. గాయాలపాలైన వ్యాపారిని వెంటనే ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

కరీమాబాద్: గర్భిణులు పోషకాహారం తీసుకోవాలని 42వ డివిజన్ కార్పొరేటర్ గుండు చందన అన్నారు. ఐసీడీఎస్ ఉర్సు సెక్టార్ పరిధిలోని రంగశాయిపేట అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ బత్తిని రమాదేవి ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతాలు, పిల్లలకు అక్షరాభ్యాసాలు, యుక్త వయస్సు బాలికలకు చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు.

కనీస వసతులు కల్పించాలని ధర్నా

వరంగల్ అర్బన్: పెద్దమ్మగడ్డ జ్యోతిబసునగర్‌లో 150 గుడిసెలు వేసుకొని జీవిస్తున్నామని, కనీస వసతులు లేక తీవ్ర అవస్థలు పడుతున్నామంటూ కాలనీవాసులు వాపోయారు. ఈమేరకు తమకు సౌకర్యాలు కల్పించాలని గ్రేటర్ వరంగల్ ప్రధాన కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాకు వినతిపత్రం అందచేశారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

వరంగల్ క్రైం: సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలో మే 25న హనుమకొండ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ద్విచక్ర వాహనం ఢీకొట్టిన ఘటనలో ప్రశాంత్‌నగర్‌కు చెందిన వానరాతి సాయిలు (55) చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందినట్లు సుబేదారి ఇన్‌స్పెక్టర్ షుకూర్ తెలిపారు. మృతుడి భార్య సంధ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.